# లౌక్యుడు ఆదర్శవాది

తెల్లనివన్నీ పాలూ, నల్లనివన్నీ నీళ్ళూ అనుకునే తత్వం నాది. మనుషుల్ని అంచనా కట్టడంలోనూ, అర్థం చేసుకోవడంలోనూ, నేను ఎప్పుడూ పొరపాటే పడతాను. జీవితానుభవం లేనివాళ్ళు పొరపాటు పడటంలో తప్పులేదు. కానీ నా పొరపాటును నేను స్వయంగా గ్రహించలేను. కనువిప్పు కలిగించడానికి మరొకరి సహాయం కావాలి. నాకు చాలాసార్లు కనువిప్పు కలిగించినవాడు నారాయణ.

నారాయణ దండిగా జీవితానుభవం వున్నవాడు, లౌక్యుడు. ఇది నారాయణపట్ల నాకున్న అభిప్రాయం. ఇంతకుమించి అతని గుణగణాల్ని గురించి చెప్పడం సాధ్యంకాదు. ఎందుకంటే నారాయణ పట్ల తలకో అభిప్రాయం వుంది. మా ఎమ్మెల్యేనో, మా జిల్లా డాక్టరు భార్యనో మా మునిసిపల్ చైర్మన్‌నో, నారాయణ విషయం ప్రశ్నిస్తే "అబ్బే నారాయణకేమండి, చాలా మంచివాడు. ఏ పని పురమాయించినా యిట్టే క్షణాలమీద చేసిపెడతాడు" అని మంచి కాంప్లిమెంటే పారేస్తారు.

ఈ తరగతికాక కొంచెం కింది తరగతికి వెళ్ళి నారాయణను గూర్చి మీరు ప్రశ్నిస్తే.... "వాడా; ఆ డాఫర్ వెధవ.... పోనిద్దూ" అంటారు. అయిపుట్టిన ప్రతి వెధవ అభిప్రాయాలకూ మనం విలువ ఇవ్వాలా అనుకుంటే క్లాసు మనుషుల కాంప్లిమెంటుచాలు. అలగాజనం అభిప్రాయాలకు ఎవడు విలువిస్తున్నాడు గనుక ఈ రోజుల్లో! అసలు నారాయణను తిట్టేవాళ్ళుకూడా పెద్దవాళ్ళదగ్గర పని తగిలితే మళ్ళీ అతణ్నే ఆశ్రయిస్తారు.

సరే ఆ విషయం అట్లా వుంచండి. నారాయణ నాకు కను విప్పు కలిగించిన సంఘటన ఒకటి చెబుతాను.

నేను ఆరోజు ఏదో సివిల్ కేసుకు సంబంధించిన లా పుస్తకాలు చూస్తున్నాను. నారాయణ వచ్చాడు. వచ్చీరాగానే" లాయరుగారూ! మనం సాయంత్రం రామాపురం దాకా వెళ్ళిరావాలండీ" అన్నాడు.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"మా అబ్బాయికి అక్కడో పెళ్ళి సంబంధం వుంది. వెళ్ళి చూద్దాం" అన్నాడు.

"నేను రావడం" అవసరమంటారా?

"అవసరమని చెప్పాలటండీ, మంచి చెడ్డల్లో పాలు పంచుకునేందుకు, మీరుగాక ఇంకెవరున్నారు నాకు? ఆప్తులూ, బంధువులూ, అంతా మీలాటివాళ్ళే కదండీ నాకున్నది" అన్నాడు నారాయణ.

"సరేలెండి" అన్నాను.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. నేను సరేలెండి అన్నానంటే నారాయణ నన్ను అప్పుడికింద జమకట్టి అడిగాడని కాదు. అసలు నారాయణ నన్ను అప్పునికింద ఎందుకు జమకట్టాడో, అందులో వున్న కిటుకేమిటో నాకు తెలుసు. నాకు జీపు వుంది గనక నారాయణ నన్ను అప్పుడి కింద జమకట్టాడు. వెళ్తున్నది పెళ్ళి సంబంధం చూడటానికి. జీపులో వెళ్ళడం, పక్కన డబ్బున్నవాడు, కాస్త పలుకుబడి వున్నవాడూ వుండటం-నారాయణకు ఎంతయినా లాభిస్తుంది. అట్లా అని నేను నారాయణ లాభంకొరకు ఒప్పుకున్నాననుకునేరు. అదేం కాదు. నా ప్రాక్టీసు మూడు పువ్వులూ ఆరు కాయలుగా వుండటానికి నారాయణ మొదట్నుంచీ శక్తివంచన లేకుండా తోడ్పడుతున్నాడు. అట్లాంటి వాని కోర్కెను ఎలా కాదనగలను, మనుషుల మధ్య ఆప్యాయతలూ, అనురాగాలు లేకపోయినా

స్వప్రయోజనాల కోసమన్నా, వున్నట్లు చూపాలికదా మరి? (ఈవిద్య నారాయణ దగ్గర నేర్చుకున్నదే)

సాయంత్రం మూడింటికి నారాయణ రెడీ అయి వచ్చాడు. రామాపురం ఎంతో దూరంలేదు. గంటన్నర ప్రయాణం. అక్కడ పనిచూసుకొని మళ్ళీ ఏడింటికి ఇల్లు చేరుకోవచ్చు. అనుకున్నది అనుకున్నట్టు జరిగివుంటే బాగానే వుండేది, కాని దారిలో వున్నట్టుండి వర్షం ప్రారంభమై జీపు బురదలో ఇరుక్కుపోయింది. ఏడింటివరకు వర్షం తెరిపి లేకుండా కురుస్తూనేవుంది. మాకు ఏం చేయడానికి తోచలేదు. వర్షం వెలిసిన తర్వాత కూడా ప్రయాణం చేయడానికి వీల్లేకపోయింది. ముందుకు వెళ్ళాలన్నా, వెనక్కి వెళ్ళాలన్నా రోడ్డు కాదు దారి అంతా జలమయం, బురద, జీపు కదలడానికి ఏమాత్రం వీల్లేదు.

"యేం చేద్దామంటావు నారాయణా" అన్నాను. "చేసేదేముంది? ఈరాత్రికి ఎలాగో ఈ వూర్లో గడిపి పొద్దున్నే బయలుదేరుదాము" అన్నాడు నారాయణ నిబ్బరంగా. జీపు పుణ్యమా అని వూరు వున్నచోట ఇరుక్కుపోయింది.

వర్షం వెలిశాక, జీపుచుట్టూ పల్లెటూరిజనం అయితే మూగారు కాని, మా మంచి చెడ్డల్ని గురించి విచారించే సూచనలు మట్టుకు కన్పించలేదు. జీపు ఎలా దిగబడిందో, దాన్ని ఎలా బయటకు తీయవచ్చో, మొదలయినవి వారికి చర్చనీయాంశాలయ్యాయి. మా తిండితిప్పలు, పడకా – ఈ విషయాలు వారు పట్టించుకున్నట్టేలేదు. కాసేపటికి అవూరి కరణంగారు కామాలు వచ్చాడు. వచ్చీరాంగానే "ఏంసార్! మీరు రెవిన్యూ డిపార్టుమెంటువాళ్ళు కాదుగదా?" అన్నాడు.

"కాదండీ" అన్నాను.

ఆ పెద్దమనిషి ఇంకేం మాట్లాడకుండా వెళ్ళిపోతున్నాడు, నారాయణ గబగబా వెళ్ళి ఆ పెద్దమనిషిని ఆపి గోడు వెళ్ళబోశాడు.

"చూడండీ! యిప్పుడు జీపు బయటకు తీసి వెళ్ళాలంటే అయ్యేపని కాదు. మాకు భోజనం గీజనం ఏం అవసరంలేదు, త్రాగడానికి కాసిని పాలు పడుకోటానికి ఇంత స్థలమూ దొరికితేచాలు — తృప్తి పడతాము. ఈ మాత్రం సాయం చెయ్యలేరా?" అని

నారాయణ కంఠంలో వ్యక్తమయిన దీనత్వానికి, ఆ పెద్ద మనిషికి దయకలిగినట్టుంది.

"కాసిని మెతుకులూ, పడకా ఏం భాగ్యం కానీండి. ఏదైనా కాస్త పరిశుభ్రంగా వుండాలి కదండి. ఈ పల్లెకొంపల్లో కష్టమండి. అదే ఆలోచిస్తున్నను. ఆఁ మీరు రామేశంగారి దగ్గరకు వెళ్ళండి. అక్కడయితే మీకు అన్నీ లక్షణంగా అమరుతాయి" అన్నాడు ఆయన.

"ఎక్కడండీ ఆయన ఇల్లు?" నారాయణ అడిగాడు.

"పదండి చూపిస్తాను" అంటూ ఆయన దారితీశాడు.

"ఎవరండీ ఈ రామేశంగారు?" దారిలో నారాయణ ప్రశ్నించాడు. ఆ పెద్దమనిషి గొంతు సవరించి ప్రారంభించేడు. "రామేశం గారి పేరు మీకు తెలియకపోవడం చాలా ఆశ్చర్యంగా వుందే? చాలామందికి తెలుసండీ ఆయన. ఈ చుట్టుపట్ల ఆయనలాటి నిస్వార్థ ప్రజాసేవకుడు ఎక్కడున్నడు? పెళ్ళికూడా చేసుకోలేదండీ రామేశంగారు."

పెళ్ళి చేసుకోకపోవడంకూడా ఒక క్వాలిఫికేషన్ కింద భావించినట్టుంది మా వెంటనున్న పెద్దమనిషి!

"అలాగటండీ" అంటూ ఆశ్యర్యం వ్యక్తం చేసేడు నారాయణ.

మేము వెళ్ళేసరికి రామేశంగారు లాంతరుముందు కూచొని ఏదో చదువుకుంటున్నాడు. మమ్మల్ని చూస్తూనే లేచి సాదరంగా ఆహ్వానించాడు. వేసుకున్న ఖద్దరులాగే ఆయన కొంచెం మందం.

వెంటవచ్చిన పెద్దమనిషి రామేశంగారికి మమ్మల్ని పరిచయంచేసి. మా పరిస్థితి వివరించేడు.

"అంతా ఈశ్వరేచ్ఛ. వుండండి, మీ భోజనం యేర్పాట్లు అవీ చూస్తాను" అంటూ ఆయన లేచాడు.

ఇంట్లో ఆడదక్షతలేని మనిషి. మాకోసం మళ్ళీ ఆయన చెయ్యి కాల్చుకోవడం మాకు సుతారమూ యిష్టంలేదు. "చెరోగ్లాసు పాలు ఇప్పించండి చాలు. భోజనం గీజనం యేం అవసరంలే"దని ఖచ్చితంగా నారాయణా, నేను ముక్తకంఠంతో చెప్పాము.

చిక్కటిపాలు చెరో గ్లాసు తెప్పించి ఇచ్చాడు రామేశంగారు. మేము పాలుతీసుకున్నాము. రామేశంగారు అప్పటికే భోంచేసినట్లు న్నారు. కాసేపు మంచీ చెడ్డా మాట్లాడుకున్నాక మా చర్చలు రాజకీయాల్లోకి దిగాయి. రామేశంగారికి మొత్తం రాజకీయాలపట్ల జుగుప్సా, ద్వేషం వున్నట్టుంది. కమ్యూనిస్టుల ప్రసక్తి వచ్చేసరికి, రామేశంగారు పూనకం వచ్చిన వ్యక్తిలా అయ్యాడు.

"వీళ్ళకి దేశభక్తి లేదండి, వట్టి అరాచకవాదులు. అందరికీ చెప్పేది ఆచరించి చూపరు. మహాత్ముడున్నాడు చూడండి. ప్రజలకు సత్యాహింసలు బోధించాడంటే - అక్షరాలా ఆచరించి చూపాడు. మాటలకూ చేతలకూ సామ్యం వుండాలంటే ...." ఇట్లా సాగింది ఆయన విమర్శ

రామేశంగారు కమ్యూనిస్టులని విమర్శిస్తుంటే నారాయణ చంక లెగురవేశాడు. వినువిను అన్నట్టు నన్ను మోచేత్తోవూది చంపాడు.

ఉన్నట్టుండి ఆయన విమర్శ కాంగ్రెసు మీదికి మళ్ళేసరికి నారాయణ నిరాశ చెందాడు. రామేశంగారు కమ్యూనిస్టులని ఎంత ఘాటుగా విమర్శించాడో అంతకు రెండింతలు ఘాటుగా కాంగ్రెసు వాదులనూ విమర్శించాడు. "కాంగ్రెసువాళ్ళకి కావలసింది ప్రజల బాగోగులు కాదండీ. పదవులు! అధికారంకోసం నానాగడ్డీ తింటు

న్నారు. పార్టీలో నీతినిజాయితీ అన్నవి లుప్తమయ్యాక ఆ పార్టీ వున్నా ఒకటే, వూడినా ఒకటే. ఛీఛీ, వీళ్ళ ప్రసక్తి వస్తే డోకు వస్తుందండి'' అంటూ చీదరించుకున్నారు. ఎంత వెడ్డా నారాయణా కాంగ్రెసు సరుకే. రామేశంగారి ధోరణి మా వాడికి ఏ మాత్రం నచ్చినట్టులేదు.

"అయితే ఇంతకీ మీకు నచ్చిన పార్టీ ఏదండి రామేశం గారూ?'' అన్నాడు నారాయణ.

''పార్టీలో ఏముందండీ నా బొంద. అసలు ఇప్పుడు దేశానికి కావలసింది పార్టీలు కాదు. మనుషులు. ప్రజలకోసం, దేశంకోసం పాటుపడే మనుషులు కావాలి. త్యాగనిరతి కావాలి. ఏదో ఒక పార్టీకి, సిద్ధాంతానికీ కట్టుబడితే తప్ప, సేవ చెయ్యడానికి వీల్లేనా ఏమిటి?'' అన్నాడు అయన.

ఆయనతోనూ నారాయణ ఏకీభవించలేదు. నా మట్టుకి నాకు ఆయన చెప్పేదంతా సబబుగానేకనబడ్డది. కాసేపట్లోనే, ఆయనపట్ల ఎక్కడలేని గురుత్వం పుట్టుకొచ్చింది.

మేము అవీ ఇవీ ముచ్చటించుకుంటున్నాము. ఇంతలోనే రామేశంగారి కోసం ఐదారుమంది గ్రామస్తులు వచ్చారు లాంతరు తీసుకొని. లామేశంగారు మావైపు తిరిగి, ''గ్రామ చావిట్లో చిన్న మీటింగులాటిది ఒకటివుంది. నేను వెళ్ళాలి. విశ్రాంతి తీసుకోవా లనుకుంటే పడుకోండి, లేదా మీరూరండి. కాసేపు కాలక్షేపం అవుతుంది'' అన్నాడు.

మీటింగు అనగానే మా నారాయణకు చెవులు పెరికినట్లుంది "పదండి మేమూ వస్తున్నాము" అంటూ సిద్ధమయ్యాడు.

అంతా బయలు దేరాము, దారిలో ఆయన మీటింగుకు సంబంధించిన విషయాలు బయటపెట్టాడు. చాలాచోట్ల అస్పత్రులు వుండి డాక్టర్లూ, మందులూ లేనట్టు-ఆ వూర్లో స్కూలు వుందికానీ,

స్కూలు భవనం లేదు. స్కూలుకు బిల్డింగు కట్టించే భారాన్ని రామేశంగారు భుజస్కంధాలమీద వేసుకున్నారు. ఆయన తన పలుకుబడి ఉపయోగించి, చుట్టుప్రక్క గ్రామాల ప్రజలనుంచి ఐదారువేల మొత్తానికి వాగ్దానాలు పొందాడు. భవనం పూర్తికావ డానికి ఇంకా కనీసం నాలుగైదువేలు కావాలి. దానికోసమే రామేశం గారు యీ మీటింగు ఏర్పాటు చేశారు.

గ్రామానికి రామేశంగారు చేస్తున్న సేవ నన్ను ముగ్ధుణ్ణి చేసింది. రామేశంలాంటి ఆదర్శవంతులు గ్రామానికొక్కరు తయార వుతేచాలు - దేశం బాగుపడుతుంది. ఈ మాటే నేను రామేశం గారితో అన్నాను. రామేశంగారు సంతోషించినట్లే వుంది.

"నా ధర్మం నేను నెరవేరుస్తున్నాను. ఇందులో మీరు పొగడ వలసింది ఏమీలేదు. మా వూళ్లోకూడా నన్ను అందరూ ఇట్లాగే పొగుడుతారు. స్కూలుకుకూడా నాపేరే పెడతామంటున్నారు నాకు కావలసింది పొగడ్తలూ కీర్తీ కాదండీ, నాతో సహకరించేవాళ్లు కావాలి. ఏదీ ఒక్కరూ సహకరించరు. ఈవూరి పరిస్థితే చూడండి. పెద్దపెద్ద భూస్వాములున్నారు. యేఒక్కరూ ఒక వంద చందా వెయ్యరు. ఎట్లాగండీ సేవచెయ్యడం?" అన్నాడు ఆయన.

సేవచెయ్యాలన్నా, డబ్బున్నవాళ్ళు సహకరించాలి. పాపం ఆయనతో ఎవరూ సరిగా సహకరిస్తున్నట్లులేదు. తన బాధని ఆయన వుపన్యాసంలో వ్యక్తంచేశాడు. త్యాగాన్ని గురించి గంటసేపు గ్రామస్తులకి బోధించాడు.

అయితే మాత్రమేం లాభం? చందాల లిస్టును పురుగును చూసినట్టు చూస్తున్నారు. నువ్వంటే నువ్వని ఒకరిమీద ఒకరు పెట్టుకుంటున్నారు.

సరిగ్గా ఈ సమయంలో, ఒక అద్భుతం—ఎవరూ వూహించని పరమాద్భుతం జరిగింది. మా నారాయణ రంగంమీదలేచి నిల బడ్డాడు. రామేశంగారి ఉపన్యాసం విని. నారాయణకూ యేదో

పూనకం వచ్చిందనీ, కాసేపు వూకదంపుడు వుపన్యాసం శ్రోతల మీద రుద్దుతాడనీ అనుకున్నాను. చిత్రం! నా వూహ తప్పిపోయింది. నారాయణ చిన్న ఉపన్యాసం యిచ్చినమాట వాస్తవం. కానీ అది ఊకదంపు ఉపన్యాసం మట్టుకుకాదు. స్కూలు భవనం కొరకు ఎవరూ చందాలు వెయ్యనవసరంలేదనీ, అంతా తనే భరిస్తాననీ, అయితే స్కూలు మాత్రం తన పేరుమీద ఉండాలనీ – నారాయణ ఉపన్యాస సారాంశం.

నారాయణ ఉపన్యాసం అందరికీ షాక్ ఇచ్చింది. అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం అలుముకుంది. నారాయణను గురించి అంతా గుసగుసలు పోతున్నారు. నారాయణకు పిచ్చి పట్టడమో, లేదా నేను కలగనడమో - యేదో జరిగి వుండాలన్న అనుమానం కలిగింది నాకు.

షాక్ నుంచి అందరూ తేరుకొనేసరికి ఐదునిమిషాలు పట్టింది. అంతా నారాయణ చుట్టూచేరి, పొగడ్తలతో ఆకాశానికెత్తుతున్నారు. జీవితంలో అట్లాంటిది ఒక ఘడియ చాలు. నారాయణ ధన్యుడు.

రామేశంగారు అన్నారు "నారాయణగారూ! ఇవ్వాళ నిజంగా నాకు చాలా సంతోషంగా ఉందండీ. దేశానికి మీలాటి త్యాగధనులే కావాలి. మీ పరిచయం కలగడం మాభాగ్యంగా భావిస్తున్నాము. ఇక మీరు వెళ్ళి పడుకోండి. ఇక్కడ మేం మాట్లాడుకోవలసిన విషయాలు ఇంకా ఉన్నవి. అన్ని విషయాలు ఉదయం మాట్లాడు కుందాం."

"నువ్వు చేసింది మంచిపనే గానీ, తలకు మించిన వాగ్దానం చేశావేమో అనుకుంటున్నాను. ఆలోచించే వాగ్దానం చేశావా?" అన్నాను పడుకుంటూ. నారాయణ కొంచెం ఉచ్చిపచ్చిగా వున్న మాట నిజమే కానీ, పదివేలు దానం చేసే తాహతు లేదు.

నారాయణ నవ్వి వూరుకున్నాడు స్థిత ప్రజ్ఞునిలా.

"డబ్బు ఎట్లా సర్దుతావ్?" అన్నాను.

"చూస్తూ వుండు" అన్నాడు నారాయణ.

నారాయణ ఎట్లా వాగ్దానం చెల్లించుకుంటాడో. నా వూహ కందలేదు. నారాయణ నిశ్చింతగా నిద్రపొయ్యాడు.

ఉదయం మేం కాఫీ తీసుకుంటుండగా గ్రామపెద్దలు వచ్చి కలిశారు. మరోసారి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చారనుకున్నాను. కానీ అదేంకాదు. నారాయణ ఇచ్చే డబ్బు అవసరంలేదని చెప్ప డానికి వచ్చారు!

కారణాలు రామేశంగారు వివరించారు.

"మీరు పరాయి గ్రామస్తులు. మీ ఔదార్యంతో మేం స్కూలు కట్టుకుంటే - అది మా వూరికే ఒక రకమైన అవమానం. మా స్కూలుకొరకు - మేము కష్టపడటం న్యాయంగా వుంటుంది. మీరు అక్కడనించి వచ్చిన తర్వాత రాత్రే మేము ఈ నిర్ణయానికి వచ్చాము."

"నాకు కావలసింది మీ వూరికొక స్కూలు భవనం. మీ డబ్బుతో మీరే కట్టుకుంటామంటే నా అభ్యంతరం లేదు" అన్నాడు నారాయణ.

గ్రామస్తులంతా తీర్థప్రజగా వచ్చి నారాయణనూ, నన్నూ జీపు దగ్గర దిగబెట్టేరు.

"వాగ్దానం నిలబెట్టుకోవలసి వచ్చివుంటే-డబ్బు ఎట్లా సంపా దించే వాడివి నారాయణా" అన్నాను జీపులోపోతూ.

"ఇట్లా జరుగుతుందని నాకు ముందే తెలుసును లాయరు గారూ, రామేశంగారి లాటి ఆదర్శవాదులు - యే పనయినా, తమ చేతులమీదుగానే జరగాలనుకుంటారు. పార్టీల ప్రమేయం కానీ, వ్యక్తుల ప్రమేయంకానీ వాళ్ళు సహించరు." అన్నాడు నవ్వుతూ నారాయణ!

——